సాక్షి ఖమ్మం

ఆదివారం ౹ 20 ౹ ఆగస్టు ౹ 2023



షాక్ నుంచి రక్షణ ఎలా!

విద్యుత్ ప్రమాదాల్లో పలువురు మృత్యువాత పడుతున్న నేపథ్యాన స్వీయ జాగ్రత్తలు తప్పనిసరని అధికారులు సూచిస్తున్నారు. 8లో



మోకాళ్లపై నిల్చుని నిరసన

సమస్యల పరిష్కారం కోసం సమ్మెకు దిగిన రెండో ఏఎన్ఎంలు శనివారం కలెక్టరేట్ ఎదుట మోకాళ్లపై నిల్చుని నిరసన తెలిపారు. 8లో

గరిష్టం / కనిష్టం

32° / 23°

వాతావరణం

జిల్లా అంతటా ఆదివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జమలాపురంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రీవారి పాదంతో పాటు మూలవిరాట్‌కు అర్చకులు పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామి, అమ్మ వార్లను ప్రత్యేకంగా అలంకరించి నిత్యకల్యాణం జరిపించాక, పల్లకీ సేవ నిర్వహించారు. తెలంగాణ, ఏపీ నుంచి పెద్దసంఖ్యలో హాజరైన భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఆలయ చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ఈఓ జగన్మోహన్‌రావు, సూపరింటెండెంట్ శ్రీనివాస్, అర్చకులు పాల్గొన్నారు.

రేపటి వరకు సర్టిఫికెట్ల పరిశీలన

ఖమ్మం సహకారనగర్: డిగ్రీ కళాశాలల్లో ప్రవేశానికి 'దోస్త్' ప్రత్యేక ఫేస్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు సోమవారం సర్టిఫికెట్ల పరిశీలన చేయించుకోవాల్సి ఉంటుంది. ఈ విషయాన్ని ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీ ఎన్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా ఒక ప్రకటనలో తెలిపారు. సకాలంలో సర్టిఫికెట్లు పరిశీలన చేయించుకోని పక్షంలో సీటు కోల్పోయే అవకాశం ఉందని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలి

ఖమ్మంగాంధీచౌక్: అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసి లబ్ధిదారులకు మేలు జరిగేలా చర్యలు చేపట్టాలని జిల్లా సంక్షేమాధికారి తాళ్లూరి సుమ సూచించారు. కలెక్టరేట్‌లో శనివారం ఆమె జిల్లాలోని సీడీపీఓలు, ఏసీడీపీఓలతో సమావేశమై పలు సూచనలు చేశారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తూ నిత్యం కేంద్రాలకు వచ్చేలా చూడాలని తెలిపారు. అలాగే, వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, పోషణ లోపంతో బాధపడే వారిని ప్రత్యేకంగా పర్యవేక్షించాలని చెప్పారు. అంతేకాకుండా కేంద్రాల ఆవరణల్లో పెరటి తోటల పెంపకం చేపట్టాలని సూచించారు. సీడీపీఓలు కవిత, కృష్ణకుమారి, శారద, శాంతి, దయామణి, కొండమ్మ, కమలప్రియ తదితరులు పాల్గొన్నారు.

వైకల్యమున్నా బడి మానలేదు!

నిఖిల్‌ను అభినందించిన డీఈఓ



విద్యార్థి నిఖిల్‌ను అభినందిస్తున్న డీఈఓ శర్మ, ఎంఈఓ, ఉపాధ్యాయులు

తల్లాడ: అడుగు తీసి అడుగు సొంతంగా వేయలేని పరిస్థితి. వీల్‌చైర్ ఉంటే తప్ప ముందుకు సాగలేని దైన్యం. అయినా ఆ విద్యార్థికి చదువుపై ఉన్న మక్కువ ప్రతిరోజూ పాఠశాలకు వచ్చేలా చేస్తోంది. వివరాలు... తల్లాడ మండలం అన్నారుగూడెం జెడ్పీహెచ్ఎస్‌లో దివ్యాంగుడైన గొర్ల నిఖిల్ 9వ తరగతి చదువుతున్నాడు. వీల్‌చైర్‌లో కూర్చోబెట్టి ఎవరైనా తీసుకురావాల్సిందే. అయినా ఏరోజు ఆయన పాఠశాలకు గైర్హాజరు కాలేదు. పాఠశాలలో శనివారం పేరెంట్స్ కమిటీ సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన డీఈఓ సోమశేఖరశర్మకు ఈ విషయం తెలియడంతో నిఖిల్‌ను అభినందించారు. అందరూ ఆయనను ఆదర్శంగా తీసుకుని శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఎస్.దామోదరప్రసాద్, హెచ్‌ఎం రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల్లో పారదర్శకత ఉండాలి

కూసుమంచి: ఉపాధిహామీ పథకం పనుల్లో ఉద్యోగులు పారదర్శకత పాటించాలని, ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించబోమని ఖమ్మం డీఆర్‌డీఓ అదనపు పీడీ శిరీష తెలిపారు. కూసుమంచి మండల పరిషత్ కార్యాలయంలో మండలంలో ఉపాధిహామీ పనులపై నిర్వహిస్తున్న సామాజిక తనిఖీ ప్రజావేదిక రెండోరోజైన శనివారం కూడా కొనసాగింది. ఈసందర్భంగా రూ.15.50 కోట్ల విలువైన పనుల వివరాలను పరిశీలించారు. అయితే, మొక్కల సంరక్షణ సరిగా లేకపోవడం, వంద రోజులు దాటిన కూలీలకు పనులు కల్పించడం, కూలీల సంతకాలు తీసుకోకుండా వేతనం చెల్లించినట్లు తేలడంతో సిబ్బందిని ఏపీడీ మందలించి బాధ్యులకు రూ.1.32 లక్షల జరిమానా విధించారు. ఎంపీడీఓ రమాదేవి, అంబుడ్స్‌మెన్ రమేష్‌తో పాటు శాస్త్రి, పవన్‌కుమార్, రమేష్, అప్పారావు పాల్గొన్నారు.

వేట మొదలైంది..!

అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నా... వేచిచూసే ధోరణిని విడనాడిన పార్టీలు అభ్యర్థులను ఖరారు చేయడంపై దృష్టి సారించాయి. ఈ వరుసలో బీఆర్ఎస్ ముందు నిలుస్తుండగా, రెండు రోజుల్లో తొలి జాబితా ప్రకటనకు సిద్ధమవుతోంది. అయితే, అనధికారికంగా బయటకు వచ్చిన జాబితా ఆధారంగా తమకు అవకాశం లేదనే సంకేతాలు అందుకున్న ఆశావహుల్లో నైరాశ్యం నెలకొంది. అయినా ఆశ వదులుకోక ప్రగతిభవన్ ఆశీస్సుల కోసం నిరీక్షిస్తున్నారు. మరోవైపు కాంగ్రెస్‌లోనూ దరఖాస్తుల సందడి మొదలైంది. జిల్లాలోని ఆశావహులు ఒక్కొక్కరుగా దరఖాస్తు చేసుకునేందుకు గాంధీభవన్ బాట పట్టారు. మరోపక్క 27వ తేదీన ఖమ్మంలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సభ నేపథ్యాన బీజేపీ సైతం బరిలో నిలిపే అభ్యర్థుల కోసం అన్వేషణ చేస్తోంది. ఈక్రమంలో ఉమ్మడి జిల్లాలోని అన్ని పార్టీల నేతలు తమ కార్యక్షేత్రాన్ని రాజధానికి మార్చారు.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

ఇప్పటికే సిద్ధమైన బీఆర్ఎస్ అభ్యర్థుల తొలి జాబితా

- టికెట్ రాదనే సంకేతాలతో ఆశావహుల్లో నైరాశ్యం
- ప్రగతిభవన్ ఆశీస్సుల కోసం చివరి వరకు నిరీక్షణ
- దరఖాస్తుకు కాంగ్రెస్ నేతల గాంధీభవన్ బాట
- బరిలో నిలిపే అభ్యర్థుల కోసం బీజేపీ అన్వేషణ



కాంగ్రెస్‌లో హడావుడి

అభ్యర్థుల ఎంపికకు సంబంధించి వడపోత కార్యక్రమానికి టీపీసీసీ శ్రీకారం చుట్టింది. మునుపెన్నడూ లేనివిధంగా ఈసారి టికెట్ ఆశిస్తున్న నేతలు దరఖాస్తు చేసుకుంటేనే పేరు పరిగణనలోకి తీసుకుంటామని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తేల్చిచెప్పారు. ఈక్రమంలో ఉమ్మడి జిల్లాలోని ఆశావహులు దరఖాస్తు చేసుకునేందుకు గాంధీభవన్‌కు క్యూ కట్టారు. ఉమ్మడి జిల్లాలోని ఒకటి, రెండు నియోజకవర్గాలు మినహా మిగిలిన చోట్ల ఇద్దరి నుంచి నలుగురి వరకు పోటీకి ఆసక్తి చూపుతున్నారు. ప్రధానంగా ఇల్లెందు, వైరా, పాలేరు, సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గాల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థుల సంఖ్య ఎక్కువగా ఉంది. వీరిలో ఇప్పటికే కొందరు దరఖాస్తు చేసుకోగా.. మరికొందరు నేతలు ఆ దిశగా సమాయత్తమవుతున్నారు.

ముందస్తుగా బీఆర్ఎస్

అభ్యర్థుల ఎంపిక అంశాన్ని బీఆర్ఎస్ ముందస్తుగా పూర్తి చేసింది. రెండు, మూడేళ్లుగా సిట్టింగ్ ఎమ్మెల్యేలు, పార్టీలోని నాయకుల పనితీరుపై చేయించిన సర్వేలు, ఇంటెలిజెన్స్ నివేదికలను పరిగణనలోకి తీసుకోవడంతోపాటు రాజకీయ సమీకరణలు, ఇతర అంశాలను బేరీజు వేసుకుని అభ్యర్థుల ఎంపికను అధినేత కేసీఆర్ పూర్తి చేసినట్లు తెలిసింది. ఈమేరకు సోమవారం మంచి ముహూర్తం ఉండడంతో అదేరోజు తొలిజాబితా ప్రకటిస్తారనే ప్రచారం జరుగుతోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అన్ని నియోజకవర్గాలకు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ పూర్తయినా, ఒకటి, రెండు స్థానాలు మినహా అన్ని స్థానాల అభ్యర్థులను వెల్లడించనున్నట్లు సమాచారం. ఇప్పటికే టికెట్లు ఖరారైన వారికే కాక ఆశావహులకూ అధిష్టానం నుంచి సమాచారం అందినట్లు తెలుస్తోంది. ప్రధానంగా వైరా సిట్టింగ్ ఎమ్మెల్యే రాములునాయక్‌కు టికెట్ నిరాకరించినట్లు ప్రచారం జరుగుతుండగా, ఆయన మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌ను కలిసి తన వాదన వినిపించినట్లు సమాచారం. మిగతా ఆశావహులు కూడా హైదరాబాద్‌లో మకాం వేసి తమ వంతు ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు.

'షా' సభ రోజే దిశానిర్దేశం

అభ్యర్థుల ఎంపికతోపాటు సంస్థాగతంగా ఉమ్మడి జిల్లాలో బలం పెంచుకోవడంపై బీజేపీ దృష్టి సారించింది. సహజంగా ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యాకే అభ్యర్థుల విషయమై బీజేపీ కసరత్తు చేస్తుంది. కానీ ఈసారి ముందుగానే ప్రకటించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈనెల 27న ఖమ్మంలో జరిగే బహిరంగ సభకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా హాజరవుతున్న నేపథ్యాన టికెట్ల కేటాయింపు, ఎన్నికల వ్యూహాలపై రాష్ట్ర, ఉమ్మడి జిల్లా నేతలకు దిశానిర్దేశం చేస్తారని తెలుస్తోంది. ఇందులో భాగంగానే అభ్యర్థులను ఖరారు చేసేందుకు రాష్ట్ర నాయకత్వం కసరత్తు జరుపుతుండగా, కొందరు నేతలకు సంకేతాలు ఇచ్చినట్లు సమాచారం. ఇదిపక్కన పెడితే ఇతర పార్టీల జాబితాలు వచ్చాక అసంతృప్త నేతలు చివరి నిముషంలో పార్టీలో చేరితే వారికి టికెట్లు కేటాయించే ఆలోచనలోనూ పార్టీ పెద్దలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఏదిఏమైనా ఈసారి ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో బోణీ కొట్టాలనే కృతనిశ్చయంతో బీజేపీ అడుగులు వేస్తున్నట్లు చెబుతున్నారు.

5కే రన్‌లో పాల్గొన్న సీపీ వారియర్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ తదితరులు



ఓటు హక్కు.. బాధ్యత

- అర్హులందరూ పోలింగ్‌లో పాల్గొనాలి
- 5కే రన్‌ను ప్రారంభించిన సీపీ విష్ణు ఎస్.వారియర్



ఫ్లెక్సీపై సంతకం చేస్తున్న ఆదర్శ్ సురభి

ఖమ్మం స్పోర్ట్స్: ఓటరుగా నమోదు చేసుకోవడం, ఎన్నికల్లో ఓటు వేయడాన్ని అందరూ బాధ్యతగా భావించాలని ఖమ్మం పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ సూచించారు. ఎన్నికల సంఘం సూచనల మేరకు ఓటర్లకు అవగాహన కల్పించేందుకు 'ఓట్ ఫర్ ష్యూర్' నినాదంతో ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియం నుంచి లకారం ట్యాంక్ బండ్ వరకు శనివారం 5కే రన్ నిర్వహించారు. ఈ రన్‌ను ప్రారంభించిన సీపీ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువతీయువకులు ఓటరుగా నమోదు చేసుకుని ఎన్నికల్లో ఓటు వేయాలన్నారు. వందలాదిగా యువత ఈ రన్‌లో పాల్గొనడం ఆనందంగా ఉందని.. ఇదే స్ఫూర్తితో రానున్న ఎన్నికల్లో పోలింగ్‌కు రావాలని సూచించారు. ఖమ్మం మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్‌సురభి మాట్లాడుతూ ఓటరు జాబితాలో పేరు, పోలింగ్ స్టేషన్ల వివరాలు తెలుసుకునేందుకు యాప్ డౌన్ లోడ్ చేసుకోవాలని తెలిపారు. కాగా, స్టేడియం నుంచి ప్రారంభమైన రన్ ఇల్లెందు క్రాస్ రోడ్డు, కోర్టు, ఇందిరానగర్, మమత ఆస్పత్రి రోడ్డు మీదుగా లకారం ట్యాంబండ్‌కు చేరుకోగా, ఓటు వేస్తామని పలువురు సంతకాలు చేశారు. ఈకార్యక్రమంలో డీఈఓ సోమశేఖరశర్మ, తహసీల్దార్ శైలజ, డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, ఏసీపీలు గణేష్, సారంగపాణి, ప్రసన్నకుమార్, నర్సయ్య, ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్.శ్రీనివాసరావుతో పాటు టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అఫ్జల్ హసన్, ఆర్.వీ.ఎస్ సాగర్, వివిధ కళాశాలల విద్యార్థులు, క్రీడాసంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు అటవీ భూములు అవసరం

ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య



పాత ఎన్టీఆర్ కాల్వను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెంకటవీరయ్య, డీఎఫ్ఓ సిద్ధార్థ్, అధికారులు

సత్తుపల్లిటౌన్: భవిష్యత్‌లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు రెవెన్యూ భూములు అందుబాటులో లేనందున అటవీ భూములను కేటాయించాలని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కోరారు. జిల్లా అటవీశాఖాధికారి సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్, ఆర్డీఓ అశోక్‌చక్రవర్తి, ఐబీ ఈఈ శ్రీనివాసరెడ్డి, సింగరేణి అధికారులతో శనివారం ఆయన పట్టణంలో పర్యటించి సమస్యల పరిష్కారం, భూఅవసరాలపై చర్చించారు. ముందుగా అటవీ భూములకు ఆనుకుని ఉన్న విరాట్‌నగర్, తదితర కాలనీల్లో జామాయిల్ వృక్షాలు పడుతుండడంతో దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించి భారీ వృక్షాలను తొలగించాలని చెప్పారు. ఆతర్వాత సింగరేణి క్వార్టర్స్ వెనుక కాలిబాటను అభివృద్ధి చేసి సరిహద్దు వెంట ఈత, తాటి వనాలు పెంచాలని సూచించారు. వేంసూరు రోడ్డులోని ఈద్గా స్థలాలు పరిశీలించాక పాత ఎన్టీఆర్ కాలువ పూడ్చివేత, అటవీ హక్కుల చట్టం ప్రకారం కిష్టారం సత్తెమ్మగుడి, ప్రభుత్వాస్పత్రికి శ్రీకృష్ణమందిరం వెనుకాల భూమి కేటాయించాలని, అర్బన్‌పార్కులోని ఈద్గాకు సరిహద్దులు నిర్ణయించాలని కోరారు. అలాగే, ఇండోర్ స్టేడియం నిర్మాణానికి జ్యోతి నిలయం పక్కన స్థలం కేటాయించడంపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే సూచించారు. మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, ఎఫ్‌డీఓ మంజుల, ఐబీ డీఈఈ మరియన్న, సింగరేణి పీఓ వెంకటాచారి, కమిషనర్ కె.సుజాత, రేంజర్ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ యోగీశ్వర్‌తో పాటు వెంకటేశ్వరరావు, నాగు, డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, అద్దంకి అనిల్, గుండ్ర రఘు, ఎం.డీ.గఫార్‌ఖాన్ పాల్గొన్నారు.

మా సమస్యలు పరిష్కరించండి..



మంత్రి సత్యవతికి వినతిపత్రం ఇస్తున్న బాధ్యులు

ఖమ్మం మామిళ్లగూడెం: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌కు విన్నవించారు. హైదరాబాద్‌లో మంత్రిని శనివారం కలిసిన తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్ల అసోసియేషన్ బాధ్యులు కనీస వేతనం రూ.26వేలు చెల్లించడంతో పాటు సీనియారిటీ ఆధారంగా పదోన్నతులు కల్పించాలని కోరారు. అసోసియేషన్ బాధ్యులు సీహెచ్.సీతామహాలక్ష్మి, సాయిఈశ్వరి, సుమతమ్మ, కరుణకుమారి, చందన, మమత తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు పత్రాలపై పోలీసులకు ఫిర్యాదు

ఖమ్మం మయూరిసెంటర్: ఇంటి నంబర్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసే సమయాన యజమానులు స్వీయ ధ్రువీకరణ సమర్పించాల్సి ఉంటుంది. అయితే, కొందరు యజమానులు తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించినట్లు తేలడంతో కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆన్‌లైన్‌లో పొందుపరిచిన వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే తప్పుగా ఉన్నాయని ఫిర్యాదు చేయగా శనివారం కేసు నమోదైనట్లు సమాచారం. అలాగే, గృహలక్ష్మి దరఖాస్తుల పరిశీలనలో కొందరు సిబ్బంది వసూళ్లకు దిగారనే ఫిర్యాదుతోనూ కమిషనర్ విచారిస్తున్నట్లు తెలిసింది.

ఉప్పెనలా దరఖాస్తులు!

- వైన్స్ దక్కించుకునేందుకు పోటాపోటీ
- గత పాలసీతో పోలిస్తే అదనంగా 995 దరఖాస్తులు
- 36వ నంబర్ షాప్‌నకు అత్యధికంగా 149 టెండర్లు
- రేపు మద్యం దుకాణాల కేటాయింపునకు డ్రా



దరఖాస్తులు స్క్రూటినీ చేస్తున్న ఎక్సైజ్ ఉద్యోగులు

ఖమ్మంక్రైం: జిల్లా ఎక్సైజ్ ఉద్యోగుల్లో ఉత్సాహం ఉట్టిపడుతోంది. తొలినాళ్లలో వైన్స్ టెండర్లు నామమాత్రంగానే రావడంతో ఆందోళన చెందగా... గడువు ముగిసే నాటికి గత పాలసీ కంటే సుమారు వెయ్యి దరఖాస్తులు అధికంగా రావడం ఈ ఉత్సాహానికి కారణం! జిల్లాలోని 122 వైన్స్‌కు గత ఎక్సైజ్ పాలసీలో 6212 టెండర్లు దాఖలు కాగా రూ.124కోట్ల ఆదాయం నమోదైంది. ఈసారి అదనంగా 995 టెండర్లు రావడంతో 7,207 దరఖాస్తుల ద్వారా ఖజానాలో రూ.144కోట్ల ఆదాయం జమ అయింది. దీంతో తమ కృషి ఫలించిందని ఎక్సైజ్ వర్గాలు సంతోషపడుతున్నాయి.

ముందంజలో ఖమ్మం ఎక్సైజ్ స్టేషన్–1, 2

ఎప్పటిలాగే ఖమ్మం ఎక్సైజ్ స్టేషన్ – 1, 2 పరిధిలోని షాపులకు రికార్డులో టెండర్లు దాఖలయ్యాయి. ఎక్సైజ్ స్టేషన్–1 పరిధిలో 24 వైన్స్ ఉండగా, గత పాలసీలో 1,180 దరఖాస్తులు రాగా ఈసారి ఏకంగా 1,747 దరఖాస్తులు అందాయి. అలాగే, ఎక్సైజ్ స్టేషన్–2 పరిధిలో 23 షాపులకు గాను 1,175 టెండర్లు(గత పాలసీలో 731) వచ్చాయి. ఏపీ వ్యాపారులతో పాటు నూతనంగా మద్యం వ్యాపారంలోకి దిగుతున్న వారు ఈ షాపులకే టెండర్లు వేసేందుకు పోటీ పడినట్లు తెలుస్తోంది. దీనికి తోడు ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేందర్‌రెడ్డి సూచనలతో సీఐలు రాజు, రాజిరెడ్డి వ్యాపారులతో సమావేశమై టెండర్లు వేయించడంలో సఫలమయ్యారని సమాచారం. జిల్లావ్యాప్తంగా ఎక్సైజ్ స్టేషన్–1 పరిధిలో 36వ నంబర్ వైన్స్‌కే అత్యధికంగా 149, స్టేషన్–2 పరిధిలో 3వ నంబర్ షాప్‌నకు 142 దరఖాస్తులు అందగా, అతి తక్కువగా మధిరలోని 94వ నంబర్ వైన్స్‌కు కేవలం 32 టెండర్లే దాఖలయ్యాయి. అలాగే, నేలకొండపల్లి సర్కిల్ పరిధిలోని 15 దుకాణాలకు గాను గత పాలసీలో 746 దరఖాస్తులు రాగా ఇప్పుడు ఈసంఖ్య 954కి చేరింది. ఇక వైరా ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 13 వైన్స్‌కు 714 (గత పాలసీలో 608), మధిర ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 16 మద్యం దుకాణాలకు 982(గత పాలసీలో 1,286), సత్తుపల్లి పరిధిలో 23 షాపులకు 1214(గత పాలసీలో 1,318), సింగరేణి సర్కిల్ పరిధిలో 10 వైన్స్‌కు గాను 421(గత పాలసీలో 343) టెండర్లు దాఖలయ్యాయి. కాగా, మధిర సర్కిల్ పరిధిలో దరఖాస్తుల సంఖ్య తగ్గడానికి ఎర్రుపాలెం పరిధి వైన్స్‌కు ఏపీ ప్రాంత వ్యాపారులు ఈసారి సుముఖత చూపకపోవడం కారణమని తెలుస్తోంది. అలాగే, సత్తుపల్లి సర్కిల్‌లోనూ ఇదే కారణంతో టెండర్లు తగ్గినట్లు భావిస్తున్నారు.

రేపు డ్రా

జిల్లాలో వైన్స్ కోసం 7,207 టెండర్లు దాఖలు కాగా, 122 మందినే విజయం వరించనుంది. ఈమేరకు సోమవారం ఖమ్మంలోని సీక్వెల్ రిసార్ట్స్‌లో కలెక్టర్ గౌతమ్ చేతుల మీదుగా డ్రా తీసి వైన్స్ దక్కించుకున్నవారి పేర్లను ప్రకటిస్తారు. కాగా, షాపులు కేటాయించిన వారు డిసెంబర్ 1వ తేదీ నుంచి వైన్స్ నిర్వహించాల్సి ఉంటుంది. శుక్రవారం అర్ధరాత్రి వరకు దరఖాస్తుల స్వీకరణ కొనసాగగా, ఎక్సైజ్ ఉద్యోగులు శనివారం పరిశీలనలో నిమగ్నమయ్యారు.

గుండెకు గండం



- పెద్దాస్పత్రిలో నిలిచిన శస్త్రచికిత్సలు
- ఇంజక్షన్లు లేక వారం రోజులుగా ఆపరేషన్లు బంద్
- ప్రాణభయంతో అల్లాడిపోతున్న బాధితులు

ఖమ్మం వైద్యవిభాగం: గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి భరోసా కల్పించేలా జిల్లా జనరల్ ఆస్పత్రిలో కార్డియాలజీ విభాగాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఏడాదిన్నరగా మెరుగైన సేవలు అందుతుండడంతో దూరప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బందులు తీరాయి. అయితే, వారం రోజులుగా మాత్రం ఇక్కడ చికిత్సకు అంతరాయం ఏర్పడింది. శస్త్రచికిత్సలు నిలిచిపోవడంతో బాధితులు బెడ్ల మీదే ఉంటూ దీనంగా ఎదురుచూస్తున్నారు. త్వరగా తమకు శస్త్రచికిత్స నిర్వహించాలని వేడుకుంటున్నారు.

అత్యాధునిక యంత్రాలు

ఇతర ప్రాంతాలతో పోలిస్తే కొన్నేళ్లుగా ఖమ్మం జిల్లాలో గుండె జబ్బులు ఎక్కువగా నమోదవుతున్నాయి. అయితే, ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరైన వైద్యం అందక ప్రైవేట్ దవాఖానాలకు వెళ్లి ఆర్థికంగా నష్టపోయేవారు. మరికొందరు నిరుపేదలు వైద్యం చేయించుకునే స్తోమత లేక తనువు చాలించేవారు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం రెండేళ్ల క్రితం గుండె సంబంధిత బాధితుల కోసం కార్డియాలజీ విభాగాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. శస్త్రచికిత్సలు నిర్వహించడానికి రూ.7 కోట్ల విలువైన క్యాథల్యాబ్ మిషన్‌ను కేటాయించగా, గత ఏడాది జనవరిలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. తద్వారా ఎంతో ఖర్చుతో కూడిన చికిత్స ఉచితంగా అందుబాటులోకి రాగా, వందలాది మందికి శస్త్రచికిత్స చేశారు. కార్డియాలజీ విభాగంలో కరోనరీ యాంజియోగ్రామ్ శస్త్రచికిత్సతో పాటు, స్టంట్లు, బలూన్ యాంజియోప్లాస్టీ, రెనల్ యాంజియోగ్రామ్, రూట్ యాంజియోగ్రామ్, కారోటిడ్ యాంజియోగ్రామ్, పెరిఫెరల్ యాంజియోగ్రామ్, బ్రాంకియల్ యాంజియోగ్రామ్, పెరీకార్డియో సెంటిసిస్ తదితర సేవలందిస్తున్నారు.

బిల్లులు పేరుకుపోవడంతో...

క్యాథల్యాబ్ యంత్రం ద్వారా చికిత్స చేయాలంటే కాంట్రాస్ట్ ఇంజక్షన్లు అవసరమవుతాయి. బాధితులకు శస్త్రచికిత్స చేసే ముందు ఈ ఇంజక్షన్ ఇచ్చి గుండె పనితీరు, ఎక్కడ ఏ సమస్య ఉంది, స్టంట్ ఎక్కడ వేయాలనే అంశాన్ని మానిటర్ ద్వారా తెలుసుకుంటారు. అనంతరమే శస్త్రచికిత్స చేయడానికి సిద్ధమవుతారు. కానీ కాంట్రాస్ట్ ఇంజక్షన్లు లేకపోవడంతో వారం రోజులుగా శస్త్రచికిత్సలు పూర్తిగా నిలిచిపోయాయి. హైదరాబాద్ గాంధీ, నిమ్స్ తదితర ఆస్పత్రుల మాదిరిగానే ఈ ఇంజక్షన్లు ఇండెంట్ పెట్టి బయట నుంచి తెప్పిస్తారు. అయితే, సరఫరా చేసే ఏజెన్సీకి బిల్లులు పేరుకుపోవడం వారు నిలిపివేశారని తెలుస్తోంది. కారణాలు ఏమైనా శస్త్రచికిత్సలు నిలిచి గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారు ఇక్కట్లు ఎదుర్కొంటుండగా... కొందరు చేసేదేం లేక బయటి ఆస్పత్రులకు వెళ్తున్నారు. మరికొందరు మాత్రం శస్త్రచికిత్స ఎప్పుడు చేస్తారా అని వేయి కళ్లతో ఎదురుచూస్తూ గడుపుతున్నారు.

ఇంజక్షన్ వస్తేనే..



ఈయన పేరు సీహెచ్.నాగేశ్వరరావు. వయస్సు 38 ఏళ్లు మాత్రమే. ఐదు రోజుల క్రితం గుండె భాగంలో నొప్పి రావటంతో కూలబడగా ఆయన భార్య ప్రభుత్వ ఆస్పత్రి కార్డియాలజీ విభాగానికి తీసుకొచ్చింది. వైద్యులు పరీక్షించి గుండె సమస్య ఉన్నట్లు గుర్తించారు. ఇన్‌పేషంట్‌గా చేర్చుకుని చికిత్స అందిస్తున్నారు. కానీ సమస్య తీవ్రత తెలియాలన్నా, శస్త్రచికిత్స చేయాలన్నా కాంట్రాస్ట్ ఇంజక్షన్ అవసరం. అవి లేకపోవడంతో యాంజియోగ్రామ్ నిర్వహించకపోగా ఏమవుతుందోనన్న బెంగతో నాగేశ్వరరావు, ఆయన కుటుంబం ఎదురుచూస్తోంది.

ఆ ఏర్పాట్లలోనే ఉన్నాం...



కాంట్రాస్ట్ ఇంజక్షన్లు లేక శస్త్రచికిత్సలు నిలిచిన మాట వాస్తవమే. బయట నుండి తెప్పించాల్సి ఉంది. ఆ ఏర్పాట్లలోనే ఉన్నాం. అయితే, ఇన్‌పేషంట్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కార్డియాలజీ వైద్యుడి పర్యవేక్షణలో చికిత్స అందుతోంది.

– బి.వెంకటేశ్వర్లు, ఆస్పత్రి సూపరింటెండెంట్

క్లుప్తంగా

ఐటీఐల్లో మూడో విడత ప్రవేశాలు

ఖమ్మం సహకారనగర్/బూర్గంపాడు/మణుగూరురూరల్: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో మూడో విడత ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఖమ్మం, బూర్గంపాడు మండలం కృష్ణాసాగర్, మణుగూరుల్లోని ప్రభుత్వ ఐటీఐల ప్రిన్సిపాళ్లు ఏ.శ్రీనివాసరావు, లక్ష్మణ్, బి.ప్రభాకర్ తెలిపారు. కళాశాలల్లో ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, మెకానికల్, కంప్యూటర్ ప్రోగ్రామింగ్ అసిస్టెన్స్ (కోపా), ఐఓటీ, స్మార్ట్ అగ్రికల్చర్ తదితర కోర్సుల్లో సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల 30వ తేదీలోగా ధ్రువపత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఎన్ని కోర్సులనైనా ఆప్షన్ ఇవ్వొచ్చని తెలిపారు. సర్టిఫికెట్ల పరిశీలన కోసం సమీప కళాశాలను ఆప్షన్‌గా ఎంచుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం http/iti.telangana. gov.in వెబ్‌సైట్‌లో పరిశీలించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

నేటి నుంచి స్తంభాద్రి ఆలయంలో పవిత్రోత్సవాలు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మంలోని ప్రాచీన దివ్యక్షేత్రమైన శ్రీస్తంభాద్రి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం(గుట్ట)లో ఆదివారం నుంచి బుధవారం వరకు 16వ వార్షిక పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఈఓ కొత్తూరు జగన్మోహన్‌రావు తెలిపారు. ఆదివారం ఉదయం ఉత్సవాలు పారంభమవుతాయని, సోమవారం 108కలశాలతో అభి షేకం, మంగళవారం పవిత్రధారణ, బుధవారం స్వామి వారి శాంతి కల్యాణం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

జలవనరుల శాఖ సీఈకి పలువురి పరామర్శ

ఖమ్మంఅర్బన్: జలవనరులశాఖ సీఈ గుగులోత్ శంకర్‌నాయక్ తల్లి మరోని (80) అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందింది. హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో ఆమెకు గుండె సంబంధిత శస్త్రచికిత్స చేయించగా, కోలుకుంటున్న తరుణంలో కన్నుమూసింది. ఆమె అంత్యక్రియలు స్వగ్రామమైన మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం నైనాల గ్రామంలో ఆదివారం నిర్వహించనున్నట్లు సీఈ తెలిపారు. కాగా, ఆయనను జలవనరుల శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పలువురు ఫోన్‌లో పరామర్శించారు.

రేపు ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల

ఖమ్మంరూరల్: ముసాయిదా ఓటర్ల జాబితాను ఈనెల 21న విడుదల చేయనున్నట్లు పాలేరు నియోజవర్గ ఈఆర్‌ఓ, డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆమె నియోజకవర్గ అధికారులతో సమావేశమై మాట్లాడారు. ముసాయిదా జాబితాను విడుదల చేశాక అభ్యంతరాలు స్వీకరించాల్సి ఉంటుందని చెప్పారు. ఈనెల 26, 27, సెప్టెంబర్ 2, 3వ తేదీల్లో ఓటర్ల నమోదుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, సెప్టెంబర్ 28వ తేదీ నాటికి అభ్యంతరాలు పరిష్కరించాలని సూచించారు. అలాగే, అక్టోబర్ 4న తుది ఓటర్ల జాబితా విడుదల చేయాల్సి ఉంటుందని తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



ప్రభాకర్ మిశ్రా (ఫైల్)

వైరా: గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ పనుల్లో పాల్గొంటున్న వ్యక్తి అనుమానాస్పద స్థితిలో శనివారం మృతి చెందాడు. ఎస్‌ఐ మేడా ప్రసాద్ కథనం ప్రకారం.. బిహార్ రాష్ట్రానికి చెందిన ప్రభాకర్ మిశ్రా (25) నాలుగు నెలలుగా గ్రీన్‌ఫీల్డ్ హైవే పనుల్లో సోమవరం ప్లాంట్‌లో పనిచేస్తున్నాడు. ఆయన ఈ నెల 17న రాత్రి బయటకు వెళ్లి రాలేదు. దీంతో గాలింపు చేపట్టగా రోడ్డు పక్కన కల్వర్టు సమీప పొలాల్లో మృతదేహం లభ్యమైంది. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. సిబ్బంది ఫిర్యాదుతో అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాట్లు తెలిపారు. ప్రభాకర్ కుటుంబీకులకు సమాచారం ఇచ్చినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

మతిస్థిమితంలేని యువకుడి అదృశ్యం



ఆదిత్య(ఫైల్)

బూర్గంపాడు: మండల పరిధిలోని సారపాక మేజర్ గ్రామపంచాయతీ పాత సారపాకకు చెందిన కందుకూరి ఆదిత్య గత నెల 27న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. అతని తండ్రి కందుకూరి నాగేశ్వరరావు శనివారం వివరాలు వెల్లడించారు. ఆదిత్య మతి స్థిమితం కోల్పోయాడని, వయసు 27 సంవత్సరాలు ఉంటుందని, గులాబీరంగు టీ షర్ట్, బ్లూకలర్ జీన్స్ ప్యాంటు వేసుకున్నాడని తెలిపాడు. బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారని పేర్కొన్నాడు. ఆచూకీ తెలిసిన వారు 81848 24873, 88974 82580 నంబర్లకు తెలిపాలని కోరాడు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,091

షాక్ నుంచి రక్షణ ఎలా?

నిర్లక్ష్యానికి నిండు ప్రాణాలు బలి
- అవగాహన లేమితోనే విద్యుదాఘాతాలు
- మృత్యువాత పడుతున్న రైతులు, పశువులు
- జాగ్రత్తలు పాటించాలంటున్న విద్యుత్ శాఖ



రెండేళ్లలో ఇలా...

ఏడాది	మృతుల సంఖ్య	పశువుల మరణం
2022-23	30	153
2023-24 (ఆగస్టు 18వరకు)	11	60కి పైగానే...

ఇటీవల లంకపల్లిలో ఫెన్సింగ్ వైరుకు కరెంట్ సరఫరా అయి మృతి చెందిన రైతు శేషాద్రి

ఖమ్మంవ్యవసాయం: వానాకాలంలో తరచూ విద్యుత్ ప్రమాదాలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. అవగాహన రాహిత్యం, నిర్లక్ష్యంతో ఎంతో మంది ప్రాణాలను పోగొట్టుకుంటున్నారు. ఈదురుగాలులతో కూడిన వర్షాలకు విద్యుత్ తీగలు తెగిపడుతుంటాయి. ఆ మార్గంలో వెళ్లి తెలియక విద్యుత్ తీగలను తాకి మనుషులు, పశువులు, జంతువులు మరణిస్తున్నాయి. పలు సందర్భాల్లో విద్యుత్ శాఖ నిర్లక్ష్యం కారణంగానూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రెండు నెలలుగా జిల్లాలో పలుచోట్ల విద్యుత్ ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయిన ఘటనలు కలవరపెడుతున్నాయి. గత పది రోజుల్లో జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు మృతి చెందడం వారి కుటుంబాల్లో విషాదాన్ని నింపింది.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

వర్షం కురుస్తున్నప్పుడు, ఆగాక తడిసిన విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లు, సపోర్టు వైరు, తడిసిన విద్యుత్ ఉపకరణాలను తాకొద్దు. విద్యుత్ వినియోగానికి ఆధునిక పరికరాలను వినియోగించుకోవాలి. బట్టలు ఆరవేసుకునే దండెం వైర్లు, విద్యుత్ వైర్లను కలపొద్దు. సపోర్టు వైర్లుగా ఇన్సులేటెడ్ జీఐ వైర్లనే ఉపయోగించాలి. కరెంట్ ఓల్టేజీలో హెచ్చుతగ్గులు ఉన్నా ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద శబ్దం వస్తున్నా వెంటనే విద్యుత్ శాఖ ఉద్యోగులకు సమాచారం ఇవ్వాలి. వాన కారణంగా చెట్టు లేక కొమ్మలు విద్యుత్ వైర్లకు తాకి, షాక్ వచ్చే ప్రమాదం ఉంటే అప్రమత్తంగా వ్యవహరించాలి. కరెంటు మోటార్లు, వ్యవసాయ పనుల నిమిత్తం వినియోగించే పరికరాలకు అతుకులు లేని సర్వీస్ వైరు ఉపయోగించాలి. రైతులు స్టార్టర్ డబ్బాలు ఇనుపవి కాకుండా పీవీసీవి ఏర్పాటు చేసుకోవాలి. తడి చేతులతో స్విచ్ బోర్డులను, స్టార్టర్లను తాకొద్దు. ఎవరికైనా పొరపాటున కరెంట్ షాక్ సంభవిస్తే దగ్గరలోని వ్యక్తులు షాక్ గురైన వ్యక్తిని రక్షించాలన్న ఆత్రుతతో అతడిని నేరుగా తాకకుండా ఎండుకర్ర, ప్లాస్టిక్ వస్తువులతో వైర్‌ను వేరు చేయాలి. పంపుసెట్లు, కరెంట్ మోటార్లు, పైపులు, ఫుట్ వాల్వ్‌ను నిర్లక్ష్యంగా తాకరాదు. వ్యవసాయ పంపుసెట్లు, స్టార్టర్లను విధిగా ఎర్త్ చేయించాలి. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద అనధికారికంగా ఫ్యూజులు మార్చటం, రిపేరు చేయటం సరికాదు. ఏ సమస్య ఉన్నా విద్యుత్ శాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వాలి. అలాగే, పశువులను స్టేవైర్, కరెంట్ స్తంభాలు, ఎర్త్‌పైపులకు కట్టేయవద్దు.

అవగాహన లేకుంటే ప్రమాదమే..

పొలాల వద్ద రైతులు, ఇళ్లలో కుటుంబ సభ్యులు విద్యుత్ ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. వానలు పడుతున్నప్పుడు గోడలు, నేల, విద్యుత్ స్తంభాలు తేమతో నిండి ఉంటాయి. ఈ తేమ కారణంగా విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకుంటాయి. విద్యుత్ లైన్లకు ఆనుకొని ఉన్న స్తంభాలకు నేలకు, గోడలకు ఇతర వస్తువులకు కరెంట్ సరఫరా జరిగి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఈ క్రమంలో వినియోగదారులు, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని విద్యుత్ అధికారులు సూచనలు చేస్తున్నారు.

విద్యుత్ విషయంలో నిర్లక్ష్యం వద్దు



విద్యుత్ విషయంలో నిర్లక్ష్యం చేయొద్దు. వర్షాకాలంలో మరింత అప్రమత్తంగా ఉండాలి. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా ప్రమాదాల బారిన పడతారు. విద్యుత్ సంబంధిత సమస్యలను ఉద్యోగులకు నేరుగా కానీ, టోల్ ఫ్రీ, హెల్ప్‌లైన్ నంబర్ల ద్వారా సమాచారం ఇవ్వాలి. ప్రజల సహకారం, విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది సమన్వయం ఉంటే ప్రమాదాలను నివారించవచ్చు.

– ఎ.సురేందర్, ఎస్‌ఈ, ఆపరేషన్ సర్కిల్, ఖమ్మం

ఎన్నో ఘటనలు

- ఈ నెల 17న స్నేహితుడికి సాయంగా పనికి వెళ్లిన యువకుడు ఫ్లెక్సీ బిగించే క్రమంలో విద్యుత్ వైర్లు తాకగా మృతి చెందాడు. మృతుడు పాల్వంచకు చెందిన భూక్యా ప్రవీణ్ ఢిల్లీలో సివిల్స్ కోచింగ్ తీసుకుంటున్నాడు.
- గత శనివారం తిరుమలాయపాలెం మండలం పాపాయిగూడెం గ్రామానికి చెందిన రైతు పిడియాల సీతారాములు వరి పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లి మోటార్ ఆన్ చేస్తున్న క్రమంలో షాక్‌కు గురై ప్రాణాలు కోల్పోయాడు.
- పెనుబల్లి మండలం లంకపల్లికి చెందిన మరో రైతు బోగి శేషాద్రి పొలం వద్ద శనివారం ఫెన్సింగ్ వైర్లకు విద్యుత్ సరఫరా కావడంతో వాటిని తాకి ప్రాణాలు వదిలాడు.
- జూన్ 2న ఖమ్మం ఐటీ హబ్‌లో విద్యుత్ పనులు నిర్వహిస్తున్న క్రమంలో ఆ శాఖ అన్‌మ్యాన్డ్ కార్మికుడు ఎస్‌కే యాకూబ్‌పాషా కరెంట్ షాక్‌తో మరణించాడు.
- ఖమ్మం శ్రీనివాసనగర్‌లో జూనియర్ లైన్‌మెన్ స్తంభంపై పనులు నిర్వహిస్తున్న క్రమంలో నిచ్చెన నుంచి పడగా తీవ్ర గాయాలయ్యాయి.
- మధిర వద్ద కొణతం రామచంద్రరావు, కుంభం విద్యుత్ ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయారు.
- గత ఏడాది జూన్ 13న తిరుమలాయపాలెం మండలం పాతర్లపాడుకు చెందిన రైతు జడల సాహెబ్ పొలం వద్దకు ఇద్దరు కూలీలతో వెళ్తుండగా మార్గమధ్యలో విద్యుత్ తీగలు తెగిపడి ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో రైతు జడల సాహెబ్ ప్రాణాలు కోల్పోయాడు.
- జూన్ 15న వేంసూరు మండలం కొత్తచౌడవరంలో రైతు ఊట్ల శ్రీను ఫెన్సింగ్ వైర్లకు విద్యుత్ ప్రవహించిన ఘటనలో ప్రాణాలు కోల్పోయాడు.
- కామేపల్లి లింగాల సబ్ స్టేషన్ పరిధిలో పనిచేసే ఓ ప్రైవేట్ విద్యుత్ ఉద్యోగి కరెంట్ లైన్ పనిచేస్తూ విద్యుత్ శాఖ నిర్లక్ష్యం కారణంగా మృత్యువాత పడ్డారు.

టోల్ ఫ్రీ, హెల్ప్‌లైన్ నంబర్లు

సమస్యలు ఎదురైతే సమాచారం ఇచ్చేందుకు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ, హెల్ప్‌లైన్ నెంబర్లను ఏర్పాటు చేసింది. ప్రధానంగా విద్యుత్ తీగలు తెగి పడితే లేదా ఇతర ప్రమాదాలు పొంచి ఉన్నా టోల్ ఫ్రీ నంబర్ 1800 425 0028, హెల్ప్‌లైన్ నంబర్ 1912 నెంబర్‌కు తెలియజేయాలి.

ఐడీఓసీ ఎదుట 'ఆశ'ల ధర్నా

మృతి చెందిన కార్యకర్త కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్



ఐడీఓసీ ఎదుట ఆందోళన చేస్తున్న ఆశ కార్యకర్తలు

ఖమ్మంమయూరిసెంటర్: విధినిర్వహణకు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆశ కార్యకర్త మాలోతు విజయ కుటుంబాన్ని ఆదుకోవడమే కాక ఆశ వర్కర్లందరికీ బీమా సౌకర్యం కల్పించాలని తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు తుమ్మ విష్ణువర్ధన్ మాట్లాడుతూ మంచుకొండ పీహెచ్‌సీ ఆశ కార్యకర్త మాలోతు విజయ మంగ్యాతండా దగ్గర బస్సు ప్రమాదంలో మృతి చెందిన నేపథ్యాన రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే, ఆశ కార్యకర్తలందరికీ బీమా సౌకర్యం కల్పించి, రూ.18 వేల వేతనం చెల్లించాలని కోరారు. ధర్నాలో యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జె.మంగమ్మ, బి.అమలతో పాటు పి.రమ్య, టీఎస్ కల్యాణ్, నాయకులు రమణ, నాగమణి, సరోజని, కమల, అనురాధ, సాయి, బి.జ్యోతి, రమణ, రాణి, విజయ, సునీత తదితరులు పాల్గొన్నారు.

మోకాళ్లపై నిల్చుని రెండో ఏఎన్‌ఎంల నిరసన



మోకాళ్లపై నిల్చుని నిరసన తెలుపుతున్న రెండో ఏఎన్‌ఎంలు



సొమ్మసిల్లిన నాగమణిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

ఖమ్మంమయూరిసెంటర్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రెండో ఏఎన్‌ఎంలు మోకాళ్లపై నిల్చుని నిరసన తెలిపారు. జిల్లావ్యాప్తంగా రెండో ఏఎన్‌ఎంలు చేస్తున్న సమ్మె శనివారం నాలుగో రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఐడీఓసీ ఎదుట నిరసన తెలపగా, నాయకులు మాట్లాడుతూ 2008 నుంచి చాలీచాలని వేతనాలతో విధులు నిర్వర్తిస్తున్నామని తెలిపారు. కరోనా సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి పనిచేసిన తమను కాదని కొత్త వారి నియామకానికి నోటిఫికేషన్ ఇవ్వడం సరికాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు గాదె లక్ష్మీనారాయణ, జయ, రాజేశ్వరి, కృష్ణవేణి, సునీత, విజయలక్ష్మి, సునీలరాణి, నాగశేషమ్మ, సుమతి, ఉండాడి నాగేంద్ర, కె.రాధ, సత్యవాణి, రమాదేవి, సావిత్రి, ఎండీ పర్వీన్, నాగమణి, నర్సుబాయి తదితరులు పాల్గొన్నారు. కాగా, సమ్మె శిబిరంలో లంకాసాగర్ పీహెచ్‌సీకి చెందిన రెండో ఏఎన్‌ఎం నాగమణి ఒక్కసారిగా కళ్లు తిరిగి కిందపడిపోయింది. దీంతో ఆమె తలకు గాయం కావడంతో సహచర ఏఎన్‌ఎంలు ఆటోలో ఆస్పత్రికి తరలించారు.

రైలుకింద పడి ఆత్మహత్య

ఖమ్మంక్రైం: గుర్తు తెలియని వ్యక్తి(45) శనివారం రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఖమ్మంలోని నర్తకి థియేటర్ సమీపాన సదరు వ్యక్తి వరంగల్ వైపు వెళ్తున్న రైలు కింద పడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, జీఆర్‌పీ ఎస్‌ఐ భాస్కర్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 94932 18856, 87126 58589 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

పదో తరగతి విద్యార్థిని...

ఖమ్మంరూరల్: మండలంలోని కామంచికల్ శివారు ముత్యాలగూడెంలో పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. కైకొండాయిగూడెనకు చెందిన కావ్య(16) అమ్మమ్మ ఇంటి వద్ద ఉండి కామంచికల్ హైస్కూల్‌లో చదువుతోంది. శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయాన ఆమె చీరతో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. కాగా, కావ్య ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

మరణంలోనూ వీడని బంధం

భార్య మృతదేహం వద్ద రోదిస్తూ భర్త మృతి



తిరుపతమ్మ - అప్పయ్య (ఫైల్)

కల్లూరురూరల్: జీవితాంతం కలిసిమెలిసి కాపురం చేస్తామని పెళ్లిపీటలపై చేసిన బాసలను వారు తప్పలేదు. భార్య మృతి చెందిన సమాచారం తెలిసి, ఆమె మృతదేహాన్ని చూడగానే భర్త కూడా కన్నుమూసిన ఘటన ఇది. కల్లూరు మండలం చంద్రుపట్లకు చెందిన రాయల అప్పయ్య (103), తిరుపతమ్మ(96) దంపతులు ఇప్పటివరకు ఎలాంటి అనారోగ్యం లేకుండా జీవిస్తున్నారు. అయితే, రెండు రోజుల కిందట తిరుపతమ్మకు గుండెపోటు రావడంతో కుటుంబసభ్యులు కల్లూరులోని ఆస్పత్రికి తీసుకెళ్లి పరీక్షలు చేయించాక ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె శనివారం తెల్లవారుజామున మృతిచెందింది. దీంతో ఖమ్మం నుంచి ఆమె మృతదేహాన్ని చంద్రుపట్లకు తీసుకొచ్చారు. ఈ క్రమంలో భార్య మృతదేహాన్ని చూసి తీవ్రంగా కలత చెందిన అప్పయ్య రోదిస్తుండగానే గుండెపోటు రావడంతో కుటుంబీకులు సపర్యలు చేస్తుండగానే తనువు చాలించాడు. వారికి ఒక కుమారుడు, ఓ కుమార్తె ఉండగా సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తదితరులు అప్పయ్య, తిరుపతమ్మ మృతదేహాల వద్ద నివాళులర్పించారు. కల్లూరు జెడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, సర్పంచ్ గొల్లమందల ప్రసాద్, యూనియన్ బ్యాంక్ మేనేజర్ ఆనంద్‌భాస్కర్‌తో పాటు కాటంనేని వెంకటేశ్వరరావు, శేషారెడ్డి, వల్లభనేని రవి, శ్రీనివాసరావు, రాధాకృష్ణ, విశ్వనాథం, థామస్ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నం

నేలకొండపల్లి: కుటుంబ కలహాల నేపథ్యాన ఓ వ్యక్తి పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మండలంలోని మంగ్రాజుపల్లికి చెందిన పెద్ద లింగయ్య (45) కుటుంబ కలహాలతో శనివారం పురుగులమందు తాగేందుకు యత్నించగా స్థానికులు అడ్డుకున్నారు. కానీ, కాసేపటికే ఆయన పురుగుల మందు తాగాడు. దీంతో కుటుంబీకులు ఆయన్ను ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

పేకాట ఆడుతున్న ఆరుగురు అరెస్ట్

ఏన్కూరు: మండల కేంద్రంలోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు తనిఖీ చేయగా వారు పట్టుబడ్డారు. ఈ సందర్భంగా ఆరుగురిని అదుపులోకి తీసుకుని రూ.7,900 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ బాదావత్ రవి తెలిపారు.

వయ్యారిభామ మొక్కలను తొలగించాలి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రుక్మిణీదేవి

మధిర: మనుషులకే కాక పశువులు, పంటలకు నష్టం కలిగించే వయ్యారిభామ కలుపు మొక్కల నిర్మూలన చర్యలు చేపట్టాలని మధిర వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.రుక్మిణీదేవి సూచించారు. వయ్యారిభామ కలుపు మొక్కల నిర్మూలన వారోత్సవాల్లో భాగంగా శనివారం పరిశోధనా స్థానంలోని అగ్రికల్చరల్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. మొక్కల పుప్పొడితో మనుషుల్లో దగ్గు, ఆయాసం తోపాటు దురద, దద్దుర్లు వస్తాయన్నారు. అలాగే, ఈ మొక్కలను తింటే పశువుల్లో కూడా అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని చెప్పారు. బీడు, బంజర, ఖాళీ ప్రదేశాలలో పంట పొలాలలో ఉండే వయ్యారిభామ కలుపు మొక్కలను పూత దశకు రాకముందే వేళ్లతో సహా పెకిలించి గుంటలలో వేసి పూడ్చాలని సూచించారు. అలాగే, కలుపు మొక్కల నివారణకు గ్లైఫోసెట్ 10 మి.లీ.ను ఒక లీటర్ నీటిలో కలిపి లేదా పారాక్వాట్ 5 మి.లీ.ను ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ టి.భరత్, కె.నాగస్వాతి, సాయిదీక్షిత్, అనూష, అగ్రికల్చరల్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థ పటిష్టతకు ప్రత్యేక చర్యలు



డెమోను పరిశీలిస్తున్న ఆర్‌సీఓ, అధికారులు

రఘునాథపాలెం: గిరిజన సంక్షేమ శాఖ గురుకుల కళాశాలల్లో నిష్ణాతులైన అధ్యాపకులను నియమించి విద్యావ్యవస్థను పటిష్టపర్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఖమ్మం రీజియన్ గురుకులాల సమన్వయ అధికారి(ఆర్‌సీఓ) డేవిడ్‌రాజ్ తెలిపారు. రఘునాథపాలెంలోని స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ కళాశాలలో తాత్కాలిక పద్ధతిపై అధ్యాపకులను నియమించనుండగా, శనివారం ఎంపిక ప్రక్రియ చేపట్టారు. ఈ సందర్భంగా డేవిడ్‌రాజ్ మాట్లాడుతూ.. కళాశాలలో వివిధ సబ్జెక్టులు బోధించేందుకు 29 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ ఆదేశాల మేరకు బీఆర్.అంబేద్కర్ రెసిడెన్షియల్ కళాశాల ప్రిన్సిపాల్, లెక్చరర్లు, ఆరుగురు పరిశీలకుల సమక్షాన అభ్యర్థులతో డెమో నిర్వహించి మార్కులు కేటాయించారు. త్వరలోనే ఎంపికైన వారి వివరాలు వెల్లడిస్తామని ఆర్‌సీఓ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బాలస్వామి, గురుకులం ఏఓ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలస్థాయి బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనం సోమవారం ఖమ్మంలో జరగనుంది. మామిళ్లగూడెంలోని ఉషాహరి కన్వెన్షన్‌లో జరిగే ఈ సమ్మేళనం కరపత్రాలను శనివారం సంఘం ప్రతినిధులు ఆవిష్కరించారు. రెండు జిల్లాలకు చెందిన బ్రాహ్మణ కుటుంబాలు పెద్ద సంఖ్యలో సమ్మేళనంలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో కేవీ మురళీకృష్ణమాచార్యులు, తాటికొండల సీతారామశాస్త్రి, వేదాంతం రాఘవాచార్యులు, ఊటుకూరు రవికాంత్, సురావజ్జల వాసుశర్మ, జమలాపురం కేశవరావు, ఆమంచి సురేశ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

Automobiles

VEHICLE FOR SALE
2022 TATA ACE GOLD CX Petrol TS 04 UE 3889 is ready for Sale in as where it is in condition Call : Sundaram Finance, KMM. 94409 09753. [M-1221496]

Education

మావద్ద SSC తో మధ్యమ, సాహిత్యరత్న హిందీ పరీక్షలు, ఓపెన్ 10th, ఇంటర్, డిగ్రీ, పి.జి. మరియు B.Ed., BPEd., B.Tech. అడ్మిషన్లకై సంప్ర. 99481 31154, ఖమ్మం. [M-1221495]

Real Estate

FLAT FOR SALE
ఖమ్మం, రాపర్తినగర్-2లో నిర్మాణంలో వున్న 1672 Sft. 3 BHK, 1332 Sft. 2 BHK ఫ్లాట్స్ అందుబాటు ధరలలో అమ్మకానికి కలవు. సంప్ర. 99126 44309 [M-10211]

PLOT FOR SALE
శరవేగంగా అభివృద్ధి చెందుతున్న బెంగుళూరు హైవే తిమ్మాపూర్, కొత్తూరు, నందిగామ ఇళ్ళమధ్యలో HMDA వెంచర్‌లో కే॥ 15 లక్షలకే ప్లాట్ సొంతం లోన్ సౌకర్యం కలదు.(ఏజెంట్లు కావలెను) 9052254789. [HA-788519]

ఖమ్మంలో తక్కువ ధరలో DTCP ప్లాట్లు లభించును. వైరారోడ్‌లో 7,500 గజం, క్షీర - 12,800 గజం, ధర్మపురి - 12,800 గజం, పృథ్వి - 10,800 గజం, మమత గొల్లగూడెం - 22,000 గజం, బల్లేపల్లి - 19,100 గజ, వైరారోడ్ విల్లా - 74 లక్షలు, బల్లేపల్లి విల్లా - 72 లక్షలు, మమతరోడ్ ఫ్లాట్స్ 56-65 లక్షల వరకు. కాట్రపల్లి నాగరాజ్ 93993 42239 [M-1221491]

Services

మీ బంగారం బ్యాంకులో గాని ఏ ఇతర సంస్థలలో గాని తాకట్టులో వున్న మీ బంగారాన్ని మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును 100% స్పాట్ క్యాష్ ✆ 8897552200 [T-142]

గెల్లా హోమియో కేర్
అన్ని దీర్ఘకాలిక వ్యాధులకు హోమియో ఔషధం, గెల్లా హోమియో కేర్, మసీదు వద్ద, కమాన్ బజార్, ఖమ్మం. సంప్ర. డా॥ గెల్లా రాజేశ్వరరావు, సెల్ : 98661 85050. [M-1221517]

PACKERS & MOVERS
మీరు ఇల్లు మారుతున్నారా! గాయత్రి ప్యాకర్స్ & మూవర్స్, ఖమ్మం (All Over India) హౌజ్ కీపింగ్ సౌకర్యం కలదు, ఖమ్మం. సంప్ర॥ 9247881187 [M-1221498]

GOLD FINANCE
బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో ఉన్నవి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) సంప్ర. ✆ 99121 05656. [M-10317]

మ్యారేజ్ బ్యూరో
కావ్యశ్రీ మ్యారేజ్ బ్యూరో విశ్వబ్రాహ్మణ, కాపు, పద్మశాలి మరియు అన్ని కులాల వారికి పెళ్లి సంబంధములు పొసగగా చూడబడును. భద్రాద్రి కొత్తగూడెం (జిల్లా) ప్రో॥ సూర్యనారాయణ. 91829 76925. [M-1221347]

BUSINESS OFFER
స్త్రీ/పురుషులు, చిన్న పెట్టుబడితో ప్రతినెల 25000/- ఫిక్స్‌డ్ వేతనంతో పాటు మీకు సరిపడ ఆదాయం పొందండి. ఫోన్ : 7386425653, 7416087357 [H-189383]

FOR SALE
ఖమ్మం సిటీ నందు వరంగల్ హైవేలో శ్రీ సిటీ 1 నందు 900SqFt. ఈస్ట్ ఫేస్ 5th Floor New అపార్ట్‌మెంట్ అమ్మకానికి కలదు. Rs. 25 లక్షలు. Negotiable. ఫోన్ : 9949673877 [H-796934]

Wanted

Lahari Consultationcy. All Types of Jobs in Khammam & Hyderabad. Contact : Gangadhar-98666 82507 [M-1221497]

ఖమ్మం జిల్లాలో మండలాల వారిగా మార్కెటింగ్ చేయుటకు అనుభవం గల మహిళలు కావలెను. మంచి జీతం. సెల్ : 94942 13958. [M-1221524]

ప్రముఖ కంపెనీ నందు ఆఫీస్ ఇంచార్జెస్ స్త్రీ/పురుషులు కావలెను. Age : 27 సం॥ పైన, చక్కటి ఆదాయం & ఇన్సెంటివ్స్ అదనం. ఖమ్మం. R. రాజేశ్వరి-9989605913, AK చౌదరి-8142492999 [M-1221482]

స్టార్‌హెల్త్ ఇన్సూరెన్స్ ఏజన్సీ కోసం మరియు పార్ట్‌టైం / ఫుల్ టైం జాబ్ కోసం సంప్రదించండి. కాట్రపల్లి నాగరాజ్, ఖమ్మం. 9399342239. [M-1221492]

మీ మొబైల్ ద్వారా మా కంపెనీ అడ్వర్టైజ్‌మెంట్ పంపుతూ వారం వారం అధిక ఆదాయం పొందండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. వివరాలకు కాల్ చేయండి. 95736 33520, 90596 33520. [M-1221523]

NIELSEN ఇంటింటి సర్వే చేయుటకు జిల్లాలోని అన్నిమండలాల్లో స్త్రీ/పు కావలెను. మండలానికి ఇద్దరు చొప్పున. 10th ఆపైన, జీతం : 10,000+ ఇన్సెంటివ్స్. ✆ 9346691859 (W) Bio-Data Send చేయగలరు. [M-1221521]

కొత్తగా స్థాపించిన మా కంపెనీలో పనిచేయుటకు కావలెను. తగిన విధంగా సంపాదించుకునే అవకాశం స్మార్ట్ ఫోన్ వుండాలి, పార్ట్ టైం 8000. ఫుల్ టైం: 20000/- 9059610637, 9346764605, 9010555733 [W-1229254]

ప్రముఖ బ్యాంకులలో కం॥ఆపరేటర్స్ /క్లర్క్స్ / అటెండర్స్ / ఆఫీస్ అసిస్టెంట్స్ / అకౌంటెంట్స్/ క్యాషియర్స్. Q: 10th-PG, ఆకర్షణీయమైన జీతం. 9492881006 [G-7531]

పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376. [H-788737]

గ్రాడ్యుయేషన్ చదువుకున్న లైసెన్ ఆఫీసర్స్ మరియు కన్‌స్ట్రక్షన్, వ్యవసాయం లో అనుభవం ఉన్న సీనియర్ సూపర్ వైజర్ కావలెను. PVC ప్రాజెక్ట్స్, Call Mon-Sat 11am-5pm on 040-23338080, 8686417794 [H-781265]

TANMAYEE ఓల్డేజ్ హోమ్, YSR సర్కిల్ వద్ద, పైపులరోడ్డు, విజయవాడ, ఆడ, మగ అటెండర్లు, వంటమనిషి కావలెను. వయసు: 20 నుండి 50 సం॥. ఫోన్ : 9652423559/7093911010, 9573000987 [H-189567]

Now Hiring Sales Staff, SRI Mahalaxmi Jewellers & Pearls, Jubilee Hills, Hyderabad. Join our Prestigious group for growth. Male Candidates only. Execullent pay. Ph: 9000703311, 9100112221, 9441436385. [HA-11739]

ప్రభుత్వ మైనారిటీ గురుకుల పాఠశాల నందు బోధించుటకు 1) PGT ఫిజికల్ సైన్స్-1 స్త్రీ/పు, Qly. PG with B.Ed., 3 సం॥ల అనుభవం, 2) PGT సోషల్-1 (స్త్రీలు) Qly. M.Com., B.Ed. 3 సం॥ల అనుభవం, 3) హౌస్ కీపింగ్ పురుషులు-1 (క్లీనింగ్), 8వ తరగతి లోపు. 21-08, 22-08-2023 (చివరితేది) 10 am to 4 pm వరకు దరఖాస్తులు స్వీకరించబడును.శ్రీ సాయిరాం అవుట్ సోర్సింగ్ ఏజన్సీ, ట్రినిటాట్స్ స్కూల్ ప్రక్కన, బస్ డిపో రోడ్, ఖమ్మం. సెల్ . 81430 39765. [M-1221527]

WANTED TEACHERS
Wanted Teacher's immediately Shanthi High School, Sambhani Nagar, Khammam, Hindi, Maths for High School (EM). Cont. : 95055 00355. [M-1221526]

సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి
వివరాలకు :
ఖమ్మం : 9705444182
9010299957
కొత్తగూడెం : 9010223783

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.